


కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు

- ప్రజలకు శుభవార్త చెప్పమన్న సీఎం కేసీఆర్
- రెండు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ
- సీఎం కేసీఆర్ ప్రాతినిథ్యం వహించడంతోనే దేశానికి ఆదర్శంగా గజ్వేల్ అభివృద్ధి
- ఇప్పుడు ప్రభుత్వ దవాఖానల్లోనే 80శాతం ప్రసవాలు
- గజ్వేల్‌లో ఇప్పుడు 350 పడకలతో అద్భుతమైన మాతా,శిశు దవాఖాన
- అభివృద్ధిని ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీలను పాతాళానికి తొక్కేయ్యాలి
- కేసీఆర్ హ్యాట్రిక్ విజయం ఖాయం
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- గజ్వేల్‌లో మాతా,శిశు దవాఖాన ప్రారంభోత్సవం

# 10 వేల మందికి 'గృహలక్ష్మి'

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 3: గజ్వేల్ నియోజకవర్గంలోని 10వేల మంది మహిళలకు గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. మంగళవారం గజ్వేల్‌లో రూ.34.22 కోట్లతో నిర్మించిన మాతా, శిశు దవాఖాన, రూ.లక్షాయాభై వేలతో నిర్మించిన పద్మశాలి భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాతా,శిశు దవాఖాన ప్రాంగణంలో 700మందికి బీసీబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చొరవతో రూ.530 కోట్ల విలువైన పనులను ప్రారంభించుకున్నామన్నారు. గజ్వేల్‌కు వెళ్తున్నానని ముఖ్యమంత్రికి చెప్పానని, అందుకు ఆయన ప్రజలకు శుభవార్త చెప్పమన్నారన్నారు.10వేల మంది మహిళలకు గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పదేండ్ల క్రితం గజ్వేల్‌కు వచ్చినప్పుడు దవాఖానల్లో పందులు, పందికొక్కులు, మురుగునీరు కనిపించేదని, ఇప్పుడు అద్భుతమైన 350 పడకల దవాఖానను నిర్మించుకున్నామన్నారు. ప్రభుత్వ దవాఖానలో అప్పుడు 30శాతం మాత్రమే ప్రసవాలు జరిగేవని, ఇప్పుడు 80శాతం జరుగుతున్నాయన్నారు. ఇప్పుడు కేసీఆర్ వల్ల ప్రభుత్వ దవాఖానల్లో ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పాలన, బీఆర్‌ఎస్ పాలనకు వ్యత్యాసాన్ని గుర్తించాలన్నారు. అప్పటి మంత్రి గీతారెడ్డి కూడా డాక్టరే కానీ గజ్వేల్‌లో దవాఖానలను పట్టించుకోలేదని, సీఎం కేసీఆర్ దొరకడం గజ్వేల్ ప్రజల అదృష్టమన్నారు. గతుకుల గజ్వేల్ ఇప్పుడు బతుకుల గజ్వేల్‌గా మారిందన్నారు. సమీకృత మార్కెట్, రోడ్లు, తాగునీరు అందడమే కాకుండా సాగునీటి ప్రాజెక్టులతో చెరువులు నిండాయన్నారు. పిల్లనియొద్దన్న గజ్వేల్‌కు ఇప్పుడు పిల్లనిస్తే గజ్వేల్‌కే ఇయ్యాలంటున్నారన్నారు. సీఎం కేసీఆర్ గజ్వేల్‌కు ప్రాతినిధ్యం వహించడం వల్ల గజ్వేల్ ప్రజలు గర్వపడేలా అభివృద్ధి చేశారన్నారు. విదేశాలు, ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చి గజ్వేల్ అభివృద్ధిని చూసి పరేషాన్ అవుతున్నాయన్నారు. గజ్వేల్ అభివృద్ధికి అధ్యయన కేంద్రంగా మారిందన్నారు.

గజ్వేల్ అభివృద్ధిని చూస్తుంటే ప్రతిపక్షాలు కుళ్లుకుంటున్నాయన్నారు. ప్రజలకు సేవ చేయడం తప్పా అని ప్రశ్నించారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్న కాంగ్రెస్ బీజేపీ పార్టీలను పాతాళానికి తొక్కేయ్యాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలకు పనులు చేసే సీఎం కేసీఆర్‌ను కడుపున పెట్టుకుని కాపాడుకోవాలన్నారు. గజ్వేల్ గౌరవాన్ని పెం చిన సీఎం కేసీఆర్‌ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం ఖాయమన్నారు. కేసీఆర్ అంటే ప్రజలకు నమ్మకమని, ఎన్నికల్లో చెప్పినా, చెప్పకున్నా కరెంట్, పింఛన్లు, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు, తాగునీరు, సాగునీరు, రోడ్లు, మౌలిక వసతులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఇలా అన్నింటిని ఇచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నారన్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అంటే పేమెంట్ కలెక్షన్స్ సెంటర్ అని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ అంటే కమిషన్, కలెక్షన్స్, కరప్షన్ అని, కేసీఆర్, బీఆర్‌ఎస్ అంటే అభివృద్ధి నమ్మకమన్నారు. కాగా పద్మశాలి సంఘం తరపున సీఎం కేసీఆర్‌కు మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానాన్ని మంత్రి హరీశ్‌రావు సంఘం అధ్యక్షుడు తలకొక్కుల దుర్గాప్రసాద్ అందజేశారు. బీఆర్‌ఎస్‌కే ఓటు వేస్తామని చెప్పారు. కార్యక్రమలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, గజ్వేల్, తూప్రాన్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



మాతా, శిశు దవాఖానను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



కార్యక్రమానికి హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు

# రుతుప్రేమకు ప్రజలే అంబాసిడర్లు



రుతుస్రావ కప్పులు, బట్ట ప్యాడ్లను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

- రుతుప్రేమ కార్యక్రమం దేశంలో ఎక్కడా లేదు
- మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు

సిద్దిపేట, అక్టోబర్ 3: మహిళల ఆరోగ్యం కోసం ఆలోచించి మంత్రి హరీశ్‌రావు చేపట్టిన గొప్ప కార్యక్రమమే రుతుప్రేమ అని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు అన్నారు. మంగళవారం పట్టణంలోని గణేశ్‌నగర్ వైజంక్షన్, సిరిసిల్ల రోడ్డులోని రేణుకా ఎల్లమ్మ ఫంక్షన్‌హాల్‌లో 6,26,41,15,16,33, 34, 40 వార్డులకు చెందిన మహిళలకు మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, స్థానిక వార్డు కౌన్సిలర్లు కెమ్మసారం ప్రవీణ్, వడ్లకొండ సాయికుమార్, సాయన్నగారి సుందర్, బర్ల మల్లికార్జున్, తస్లీమా బేగంమొయిజ్, గడాల సంధ్యాశ్రీకాంత్, తడూరి సాయిఈశ్వర్ గౌడ్, డా. శాంతిలతో కలిసి వార్డు మహిళలకు రుతుప్రేమ కార్యక్రమంపై అవగాహన కల్పించి ఉచితంగా రుతుస్రావ కప్పులు, బట్ట ప్యాడ్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ కార్యక్రమం దేశంలో ఎక్కడా లేదన్నారు. రుతుప్రేమ కార్యక్రమానికి ప్రజలే అంబాసిడర్లు అన్నారు. మంత్రి హరీశ్‌రావు కృషి, పట్టుదలతో సిద్దిపేట పట్టణం అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉందన్నారు. కప్పులవాడకంలో భయాలు అవసరం లేదని 45,000 మంది మహిళలు వినియోగిస్తున్నారని చెప్పారు.

# అవరోధాలు లేకుండా అభివృద్ధి జరగాలి

## అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



మాట్లాడుతున్న అదనపుకలెక్టర్ గరిమాఅగర్వాల్

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 3: గ్రామపంచాయతీల్లో ఎలాంటి అవరోధాలు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు జరగాలని అదనపుల కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంపీడీవో, ఎంపీవో, విద్యుత్‌శాఖ ఈఆర్‌వో, ఏఈలతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పంచాయతీల్లో ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా జరపాలన్నారు. ముఖ్యంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలు త్వరగా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్‌భగీరథ, గ్రామపంచాయతీ, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనం ఇలా అన్ని ప్రభుత్వ కార్యకలాపాల్లో విద్యుత్ బకాయిలు త్వరగా చెల్లింపులు జరపాలన్నారు. ఆస్తి పన్ను, ఇంటి పన్ను వసూళ్లపైన దృష్టి సారించాలన్నారు. వాడకం లేనటువంటి విద్యుత్ కనెక్షన్ల నామమాత్రపు బిల్లులు పేరుకుపోతున్నాయని, ఎంపీవోలు కోరగా అవసరం లేని కనెక్షన్లను తొలిగించాలని విద్యుత్ అధికారులకు తెలిపారు. బకాయిలు పెండింగ్‌లో ఉన్న మండలాల్లో డీపీవోలు పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో డీపీవో దేవకీదేవి, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి సత్యవతిరాథోడ్ పర్యటన

హుస్నాబాద్, అక్టోబర్ 3: మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ బుధవారం హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వంగ వెంకట్రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు చెప్పారు.

## కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నాం

సిద్దిపేట, అక్టోబర్ 3 : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఎదురుచూస్తున్న పీఆర్సీకమిటీని ప్రభుత్వం నియమించడం హర్షణీయమని సిద్దిపేటలో పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ అన్నారు. మంగళవారం పీఆర్టీయు నాయకులతో కలిసి మాట్లాడుతూ మధ్యంతర భృతిని కనీసం 18శాతం ప్రకటించాలన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి 18శాతానికి తగ్గకుండా మధ్యంతర భృతిని కట్టించాలని కోరారు. సమావేశంలో జిల్లా మాజీ ప్రధానకార్యదర్శి పంతం వెంకటరాజం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆస లక్ష్మణ్, రాయపోల్ మండల శాఖ అధ్యక్షుడు బొల్లం రాజశేఖర్ నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు ఎర్ర పార్థసారథి రాష్ట్ర బాధ్యుడు ఎల్లేశ్, సీపీఎస్‌యు రాష్ట్ర బాధ్యుడు కూరాకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నవీన్‌కు శాంతి సేవారత్న అవార్డు

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 3: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని సిద్దిపేట సంతోషి మాత ఆలయ చైర్మన్ మంకాల నవీన్‌కుమార్ సేవలను గుర్తించి మంగళవారం హైదరాబాద్ సిటీకల్చర్ సెంటర్‌లో నేషనల్ మహాత్మాగాంధీ శాంతి సేవారత్న అవార్డుతో ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకుడు చక్రవర్తి మాట్లాడుతూ మంకాల నవీన్‌కుమార్ సమాజసేవకు అంకితమవుతునే, ఆధ్యాత్మిక. ధార్మిక సేవల్లో తనదైన ముద్ర వేశారన్నారు. ఆయన సేవాభావాన్ని గుర్తించి శాంతి సేవారత్న అవార్డును అందించామన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని మంకాల నవీన్‌కుమార్ అన్నారు.

## అత్యాధునిక వైద్యంతో బాలుడి చేతిని కాపాడిన వైద్యులు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 3: సైకల్ పైనుంచి పడి ఓ బాలుడి చేయి విరిగిపోవడంతోపాటు నరాలు తెగిపోయి చేతి రక్త ప్రసరణ ఆగిపోయి పల్స్ పడిపోయింది. ఇక చేతిని తొలిగించడం ఖాయం అనుకున్న సమయంలో సికింద్రాబాద్ యశోద దవాఖాన వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి చేతిని కాపాడారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం హ్యాండ్ మైక్రో సర్జన్ మనీశ్‌కుమార్ జైన్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా చిన్నగుండవెళ్లి గ్రామానికి చెందిన రామ్‌చరణ్ గత నెలలో సైకిల్ పైనుంచి ప్రమాదవశాత్త కిందపడ్డాడు. ఈ ప్రమదంలో చేయి విరిగింది. అతడిని ప్రైవేట్ దవాఖానుకు తరలించారు. బాలుడుని పరీక్షించిన వైద్యుడు మెరుగైన వైద్యం కోసం యశోదకు రెఫర్ చేశారు. అతడిని పరీక్షించగా చేయి పూర్తిగా దెబ్బ తిన్నట్లు గుర్తించారు. డాక్టర్ పూర్ణచందర్‌తో కలిసి సుమారు రెండు గంటలు అరుదైన శస్త్ర చికిత్సనిర్వహించి బాలుడు చేతిని మామూలు స్థితికి తీసుకువచ్చామని వైద్యుడు మనీశ్ వెల్లడించారు.